నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అంబర్‌పేట, జనవరి 8 : నియోజకవర్గం లోని పలుప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని సీబీడీ – సీ2 ఏడీఈ జి.నాగేశ్వర్‌రావు తెలిపారు. ట్రీ ట్రీమింగ్, లైన్ ఏబీ స్విచ్‌లు, డీటీఆర్ ఏబీ స్విచ్‌లు, డబుల్ జంపర్స్ రెక్టిఫికేషన్, మెయింటెనెన్స్ వర్క్‌కోసం కింది ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం ఉంటుందని చెప్పారు. 11 కేవీ ఛే నంబర్ ఫీడర్ పరిధిలోని గోల్నాక చర్చి, అశోక్‌నగర్ నాలా, తిలక్‌నగర్, ఛే నంబర్ కూరగాయల మార్కెట్, పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 : 30 వరకు, 11 కేవీ ప్రివెంటివ్ మెడిసిన్ (పాక్షిక) ఫీడర్ పరిధిలోని శివాజీనగర్, దుర్గా మెస్, హెచ్‌ఆర్‌డీ డిగ్రీ కళాశాల, రత్న డిగ్రీ కళాశాల, నారాయణగూడ ఫ్లైఓవర్, రెడ్డి కళాశాల పరిసర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు,11 కేవీ ఫీవర్ హాస్పిటల్ (పాక్షిక) ఫీడర్ పరిధిలోని ఫీవర్ హాస్పిటల్, అంజయ్య క్వార్టర్స్, తెలంగాణ యువతి మండలి, బర్కత్‌పుర పెట్రోల్‌బంకు ప్రాంతాల్లో ఉదయం 11 : 30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు, 11 కేవీ రాజేంద్ర ఆయిల్‌మిల్ ఫీడర్ పరిధిలోని ఎమ్మార్వో ఆఫీస్, 10 టీవీ, సోప్ ఫ్యాక్టరీ, అచ్చయ్యనగర్, ఆర్టీసీ కల్యాణ మండపం, రాజేంద్ర ఆయిల్‌మిల్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 : 30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

మెహిదీపట్నం : విద్యుత్‌లైన్లలో మరమ్మతుల కారణంగా ఆసిఫ్‌నగర్ సబ్‌డివిజన్ పరిధిలోని 11 కేవీ హకీంపేట్ ఫీడర్,11 కేవీ టోలిచౌకి ఫీడర్,11 కేవీ డీలక్స్ కాలనీ ఫీడర్,11 కేవీ సూర్యనగర్ ఫీడర్ ప్రాంతాల్లో గురువారం సరఫరా నిలిపివేస్తున్నట్లు మెహిదీపట్నం సీబీడీ ఏడీ తెలిపారు.

ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు..

హకీంపేట్, అల్ హస్నత్ కాలనీ, యూసుఫ్ టెక్డి, మిరాజ్ కాలనీ, మిలిటరీ ఏరియా, మందార్ రెస్టారెంట్, నిజాంకాలనీ, టోలిచౌకి, డీలక్స్ కాలనీ, దౌలత్ గుల్షన్ కాలనీ, బడాజానకీ నగర్, కె.ఎఫ్.సి. ప్రాంతాలు.

మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..

డీలక్స్ కాలనీ, దౌలత్ గుల్షన్ కాలనీ, బడాజానకీ నగర్, మినీజానకీ నగర్, పోడియం మాల్, ప్రోఅగ్రో సీడ్స్, సూర్యనగర్, ఛాబ్రా ఎన్‌క్లేవ్, రాహుల్ కాలనీ, ఆడమ్స్ కాలనీ ప్రాంతాలు.

పాతవారికే షాపులు కేటాయించాలి

సుల్తాన్‌బజార్ : బేగంబజార్ చేపల మార్కెట్‌లో నూతనంగా నిర్మించిన భవనంలో షాపులను పాత వారికే కేటాయించాలని గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కృష్ణగుప్తా డిమాండ్ చేశారు. బుధవారం ఆయన బేగంబజార్ ఫిషర్ మెన్ అసోసియేషన్ జల్ క్షత్రియ ప్రతినిధుల అభ్యర్థన మేరకు చేపల మార్కెట్‌లో సందర్శించారు. విలేకరులతో మాట్లాడుతూ.. నిజాంకాలం నుంచి బేగంబజార్ చేపల మార్కెట్‌లో ఐదువేల కుటుంబాలు చేపలు విక్రయిస్తూ జీవనోపాధి పొందుతున్నాయన్నారు. 1936 నుంచి విక్రయిస్తున్న వారికే నూతనంగా నిర్మించిన భవనంలో షాపులను కేటాయించాలని డిమాండ్ చేశారు. నిర్మించి రెండేండ్లైనా ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.19 లోగా అధికారులు నోటిఫికేషన్‌ను రద్దు చేయని పక్షంలో గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. వినకుంటే గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్, బేగంబజార్ కార్పొరేటర్ గొంటి శంకర్‌యాదవ్, గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా, బేగం బజార్ ఫిషర్ మెన్, జల క్షత్రియ సమాజ్ ప్రతినిధులు, చేపల విక్రయదారులతో కలిసి జీహెచ్‌ఎంసీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా కార్యదర్శి రాజేందర్ శర్మ, కార్వాన్ కన్వీనర్ గోదా లక్ష్మీకాంత్ యాదవ్, జల క్ష త్రియ సమాజ్ అధ్యక్షుడు ప్రకాశ్‌సింగ్, కార్యదర్శి సుధీర్ సింగ్, కోశాధికారి రాజ్‌కుమార్ సింగ్, నాయకులు బజరంగ్‌సింగ్, శీతల్ సింగ్ పాల్గొన్నారు.

చేపల మార్కెట్‌లో మాట్లాడుతున్న గోల్కొండ జిల్లా కిసాన్ మోర్చా ప్రధాన కార్యదర్శి కృష్ణ గుప్తా

ఫీజు బకాయిలు విడుదల చేయాలి

కాచిగూడ, జనవరి 8 : ప్రభుత్వం విద్యార్థుల ఫీజు బకాయిలు రూ.4500 కోట్లు వెంటనే విడుదల చేయాలని బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేదర్‌పటేల్‌గౌడ్ డిమాండ్ చేశారు. బుధవారం చాదర్‌ఘాట్‌లో బీసీ నాయకులతో కలిసి నిరసన వ్యక్తం చేశారు. కొన్ని నెలలుగా బకాయిలు విడుదల కాకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చట్టసభల్లో బీసీ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడానికి తెలంగాణ అసెంబ్లీ ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వానికి పంపాలని కోరారు. కేంద్రం బీసీలపై అనుసరిస్తున్న విధానం సరైంది కాదని, అందుకు తెలంగాణ ప్రభుత్వం స్పందించి శాసనసభలో తీర్మానం ప్రవేశపెట్టి బీసీల పక్షాన నిలబడాలని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న రాజేందర్‌పటేల్ గౌడ్

మన సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాలి

సుల్తాన్‌బజార్ : సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడుకోవాల్సిన అవసరముందని బీసీ కమిషన్ సభ్యులు రంగు బాలలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం నిజాం కళాశాలలో లిటరరీ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో క్లస్టర్ కాలేజీల సంక్రాంతి ఫెస్టివల్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె ప్రిన్సిపాల్ ప్రొ. ఏవీ రాజశేఖర్, వైస్ ప్రిన్సిపాల్ ప్రొ. జి.ఉపేందర్‌రెడ్డి, కల్చరల్ లిటరరీ క్లబ్ కో – ఆర్డినేటర్ స్వాతి, పీఆర్వో డాక్టర్ కవిత షిండేతో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించి, భోగి మంటలను వెలిగించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బకాయిలు త్వరలో విడుదల చేస్తాం

సమావేశంలో పాల్గొన్న పరిశ్రమల శాఖ డైరక్టర్ డాక్టర్ జి.మల్సూర్, వక్తలు

తెలుగు యూనివర్సిటీ, జనవరి 8 : పరిశ్రమలకు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహకాలను తెలంగాణ ప్రభుత్వం త్వరలో విడుదల చేస్తుందని పరిశ్రమల శాఖ డైరెక్టర్ డాక్టర్ జి.మల్సూర్ హామీ ఇచ్చారు. ఫెడరేషన్ ఆఫ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్‌లోని ఫ్ట్యాప్సీ హాల్‌లో తెలంగాణ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రైజెస్ పాలసీపై ఎంఎస్‌ఎంఈల ప్రయోజనాల కోసం ప్రత్యేక అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు.

పరిశ్రమల శాఖ సులభతరం చేసేది తప్ప నియంత్రించే సంస్థ కాదన్నారు. అన్ని పరిశ్రమల రంగాల్లో ఎంఎస్‌ఎంఈ అత్యంత ముఖ్యమైన రంగమని, దేశ ఆర్థిక, సామాజిక అభివృద్ధిలో ఎంఎస్‌ఎంఈల కృషి గణనీయంగా ఉందన్నారు. గత సెప్టెంబర్‌లో ప్రభుత్వం ఎంఎస్‌ఎంఈ విధానాన్ని మొదటిసారిగా ప్రారంభించి ప్రగతిశీల విధానానికి దోహదం చేసిందన్నారు. 2016 నుంచి పరిశ్రమలకు పెండింగ్‌లో ఉన్న ప్రోత్సాహక బకాయిలు రూ.4,250 కోట్లను త్వరలో విడుదల చేసేందుకు ప్రభుత్వం యోచిస్తుందని పేర్కొన్నారు. తక్కువ పెట్టుబడితో ప్రారంభించబడుతున్న మైక్రో కంపనీలను మరింత అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందన్నారు. పరిశ్రమల కమిషనరేట్ జాయింట్ డైరెక్టర్ మధుకర్‌బాబు పాల్గొని ఎంఎస్‌ఎంఈ విధాన పాలసీలు వివరించారు. ఫ్ట్యాప్సీ హెచ్‌ఆర్ అవార్డుల 6వ ఎడిషన్ పోస్టర్‌ను పరిశ్రమల డైరెక్టర్ డాక్టర్ మల్సూర్ ఆవిష్కరించారు. ఫ్ట్యాప్సీ అధ్యక్షుడు సురేశ్‌కుమార్ సింఘాల్, పారిశ్రామిక వేత్తలు శ్రీనివాస్ గరిమెళ్ల, మీలా సంజయ్ పాల్గొన్నారు.

ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని ఐదేళ్ల ఇంటిగ్రేటెడ్ ఎంబీఏ పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి, రెండు, మూడు, నాలుగు, ఐదు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. విద్యార్థులు తమ మెమోలను మూడు వారాల తరువాత నుంచి సంబంధిత కళాశాలల్లో తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ.700 చొప్పున చెల్లించి ఈనెల 18వ తేదీలోగా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల ద్వారా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చొప్పున చెల్లించి ఈనెల 16వ తేదీలోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని పేర్కొన్నారు.

మేరు సంఘం ఆధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్

అబిడ్స్, జనవరి8 : మేరు సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 11,12 తేదీల్లో రెండు రోజుల పాటు మేర క్రికెట్ లీగ్ సీజన్ – 3 పేరుతో నిజాం కళాశాల మైదానంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు ప్రతినిధులు తెలిపారు. ఈ విషయమై బీసీ సంక్షేమ శాఖ మంత్రి, నగర ఇన్‌చార్జి పొన్నం ప్రభాకర్‌ను ముఖ్యఅతిథిగా హాజరు కావాలని కోరుతూ ఆహ్వానపత్రం అందజేశారు. కార్యక్రమంలో మేరు సంఘం నాయకులు కీర్తి రాజగోపాల్, దీకొండ నర్సింగ్ రావు, క్రికెట్ ఆర్గనైజర్ ఓదెల శేఖర్ పాల్గొన్నారు.

టీఎన్జీవో కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్ఎం. ముజీబ్‌హుస్సేనీని నాంపల్లిలోని టీఎన్జీవో హైదరాబాద్ జిల్లా శాఖ కార్యాలయంలో టీఎన్జీవో నాల్గవ తరగతి హైదరాబాద్ జిల్లా ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వర్కల సత్యనారాయణ, కార్యదర్శి రాపోలు మహేందర్, కోశాధికారి అహ్మద్ పాషా కలిసి శాలువాతో సన్మానించి, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- సుల్తాన్‌బజార్

సన్మానం..

సౌత్‌వెస్ట్ జోన్ డీసీపీగా బాధ్యతలు చేపట్టిన మహ్మద్ ఇక్బాల్ సిద్ధిఖీని కలిసి సన్మానించిన గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్, మహ్మద్ అహ్మద్, సయ్యద్ సలీం, జాఫర్, రెహాన్ జాబ్రీ

- అబిడ్స్

మంత్రి పొన్నం పర్యటన

కార్వాన్ నియోజకవర్గం లంగర్‌హౌస్ డివిజన్ ఇబ్రహీంబాగ్ వన్‌మోర్ కాలనీలో ఉన్న తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్‌మొహినుద్దీన్‌తో కలిసి పర్యటించారు. విద్యార్థులకు ఏర్పాటు చేసిన యూనిఫాం డైట్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

- మెహిదీపట్నం

అజ్మీర్ దర్గాలో చాదర్ సమర్పణ

ఉత్తర్‌ప్రదేశ్ అజ్మీర్ దర్గా ఉర్సు ఉత్సవాల్లో నాంపల్లి ఎమ్మెల్యే మాజిద్ హుస్సేన్ పాల్గొని చాదర్ సమర్పించారు. ప్రార్థనల అనంతరం ఉర్సు నిర్వాహకులు ఎమ్మెల్యేను సన్మానించారు.

- మెహిదీపట్నం

మల్లేపల్లిలో అధికారుల పర్యటన

నాంపల్లి నియోజకవర్గం మల్లేపల్లి డివిజన్లో బుధవారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ – 12 అధికారులు పర్యటించారు. ప్రజలు పరిసరాల పరిశుభ్రత పాటించాలని, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో జీహెచ్ ఎంసీ మలేరియా విభాగం, పారిశుధ్య విభాగం అధికారులు, ఎంఐఎం కార్పొరేటర్ ప్రతినిధి జాఫర్‌ఖాన్ పాల్గొన్నారు.

- మెహిదీపట్నం

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

కాచిగూడ : పాత ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నుంచి కుమార్ థియేటర్ వరకు రోడ్డుపై స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేయాలని డీసీ మారుతీ దివాకర్‌ను కార్పొరేటర్ కన్నె ఉమా రమేశ్ యాదవ్ కోరారు. బుధవారం డీసీతో కలిసి కార్పొరేటర్ ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. సీసీ రోడ్లను వెంటనే నిర్మించాలన్నారు. కార్యక్రమంలో కాచిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఈఈ రమేశ్, డీఈ సంజయ్, ఏఈ ప్రశాంత్, నాయకులు సుభాష్ పటేల్, బి.భీమరాజు, సంతోష్, నాగురామకృష్ణ, రవియాదవ్ పాల్గొన్నారు.

రోడ్డు పనులు పరిశీలన

అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేస్తోన్న సీసీరోడ్డు పనులను బుధవారం కార్పొరేటర్ విజయ్‌కుమార్ గౌడ్ పరిశీలించారు. పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అధికారులకు సూచించారు. కార్పొరేటర్ వెంట బీఆర్ఎస్ నాయకులున్నారు.

- గోల్నాక

వివిధ కోర్సుల పరీక్ష తేదీల ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8: ఓయూ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ తెలిపారు. ఎంబీఏ (సీబీసీఎస్), ఎంబీఏ (టెక్నాలజీ మేనేజ్‌మెంట్), ఎంబీఏ (టూరిజం అండ్ ట్రావెల్ మేనేజ్‌మెంట్) కోర్సుల మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 21వ తేదీ నుంచి, మాస్టర్ ఆఫ్ హాస్పిటల్ మేనేజ్‌మెంట్ (ఎండీహెచ్ఎం) మొదటి సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 24వ తేదీ నుంచి, ఎంబీఏ (ఈవినింగ్) ఐదో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలను ఈనెల 25వ తేదీ నుంచి నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. వివరాలను వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ పరీక్ష ఫీజు స్వీకరణ

ఓయూ పరిధిలోని బ్యాచ్‌లర్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీ కోర్సు పరీక్ష ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు మొదటి సెమిస్టర్ మెయిన్ పరీక్ష ఫీజును ఈనెల 25వ తేదీ వరకు సంబంధిత కళాశాలల్లో చెల్లించవచ్చన్నారు. ఈ పరీక్షలను ఈ నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పరీక్ష తేదీల పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తామన్నారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

ఎంఏ లాంగ్వేజెస్ పరీక్ష జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తుల ఆహ్వానం

ఓయూ పరిధిలోని ఎంఏ లాంగ్వేజెస్ కోర్సుల పరీక్షల జవాబు పత్రాల నకలు పొందేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుల రెండు, నాలుగో సెమిస్టర్ రెగ్యులర్, మొదటి, రెండు, మూడు సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని చెప్పారు. జవాబు పత్రాల నకలు పొందేందుకు ఒక్కో పేపర్‌కు రూ.1,000 చొప్పున చెల్లించి ఈ నెల 16వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫలితాలపై చాలెంజ్ వాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.10,000 చొప్పున చెల్లించి ఈ నెల 38వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో చూసుకోవచ్చని సూచించారు.

వివిధ లా కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాల విడుదల

ఓయూ పరిధిలోని వివిధ లా కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మూడేళ్ల ఎల్ఎల్‌బీ, మూడేళ్ల ఎల్ఎల్‌బీ ఆనర్స్, ఐదేళ్ల బీఏ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీకామ్ ఎల్ఎల్‌బీ, ఐదేళ్ల బీబీఏ ఎల్ఎల్‌బీ తదితర కోర్సుల పరీక్ష రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్‌సైట్ www.osmania.ac.inలో అందుబాటులో ఉంచినట్లు పేర్కొన్నారు.

కష్టపడి చదివి.. ఉన్నత లక్ష్యాలు చేరుకోండి



కార్యక్రమంలో మాట్లాడుతున్న బాలలత

ఉస్మానియా యూనివర్సిటీ, జనవరి 8 : విద్యార్థులు కష్టపడి చదివి, ఉన్నత లక్ష్యాలు చేరుకోవాలని ఓయూ వీసీ ప్రొఫెసర్ ఎం.కుమార్ పిలుపునిచ్చారు. ఓయూ సివిల్స్ అకాడమీలో ఉచిత సివిల్ సర్వీసెస్, పోటీ పరీక్షల కోచింగ్‌ను బుధవారం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా ప్రొఫెసర్ కుమార్‌తో పాటు, పోటీ పరీక్షల నిపుణులు ఎం.బాలలత, ప్రొఫెసర్ చింత గణేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కఠినమైన అంశాలను సులభతరంగా అర్థం చేసుకునే స్మార్ట్‌వర్క్‌తో కూడిన అధ్యయనం విద్యార్థులను ప్రభుత్వ అధికారులుగా చేస్తుందని అన్నారు. నాణ్యమైన పుస్తక సేకరణే విజయానికి ప్రధానమెట్టు అని అభివర్ణించారు. కార్యక్రమంలో అకాడమి డైరెక్టర్ ప్రొఫెసర్ కొండా నాగేశ్వర్, కోఆర్డినేటర్ డాక్టర్ విజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వామి మహాపడి పూజ

కాచిగూడ, జనవరి 8 : తుల్జాభవన్‌లో లకాకుల ప్రవీణ్ కుమార్, బోసు, యాదగిరి గురుస్వాముల ఆధ్వర్యంలో బుధవారం అయ్యప్పస్వామి మహాపడి పూజ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమారమేశ్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ గుజ్జ కృష్ణ, జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పాల్గొన్నారు.

అంబర్‌పేట, జనవరి 8 : శ్రీవిశ్వబ్రాహ్మణ సమైక్య సంఘం అంబర్‌పేట నియోజకవర్గం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను బాగ్‌అంబర్‌పేట కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు బి.వెంకటరెడ్డి, సంఘం అధ్యక్షుడు వి.కృష్ణచారి, ప్రధాన కార్యదర్శి సిరిగోజి నరేందర్‌చారి, కోశాధికారి కంది పెంటాచారి, ఉప కోశాధికారి వి.నాగరాజుచారి పాల్గొన్నారు.

ఆదిజాంబవ సంక్షేమ సంఘం

మాజీ అధ్యక్షుడు బాలకృష్ణ మృతి

కార్వాన్, జనవరి 8 : జియాగూడ డివిజన్ బీజేపీ నాయకుడు, ఆదిజాంబవ సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు మ్యాతరి బాలకృష్ణ బుధవారం నిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందాడు. 40 ఏండ్లుగా ప్రజలకు సేవ చేస్తూ జియాగూడ ఆదిజాంబవ సంక్షేమ సంఘం, శ్రీ నల్లపోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్, బీజేపీ సీనియర్ నాయకుడిగా సేవలందించారు. ఇందిరానగర్‌లో నివాసముంటున్న బాలకృష్ణ (62)కు భార్య, ముగ్గురు కుమారులు. అనారోగ్యంతో ఉస్మానియాలో చికిత్స పొందుతున్న అతడిని రెండు రోజుల క్రితం నిమ్స్‌కు తరలించారు. చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచారు. బస్తీ వాసులు, బీజేపీ నాయకులు తరలివచ్చి ఆయన కుటుంబానికి సంతాపం తెలిపారు. ఇందిరానగర్‌లో ప్రభుత్వం నుంచి ప్రజలకు ఇండ్లపట్టాలు అందించడంలో కృషి చేశారని ఆయన సోదరుడు శ్రీనివాస్ తెలిపారు.

వృద్ధుడు అదృశ్యం

మెహిదీపట్నం, జనవరి 8 : ఓ వృద్ధుడు అదృశ్యమై నెలలు గడుస్తున్నా ఆచూకీ దొరకడం లేదంటూ కుటుంబసభ్యులు లంగర్‌హౌస్ పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హుశేనగర్‌లో నివసించే ఎండీ బిలాల్ మహ్మద్ మామ మహ్మద్ అలీ గతేడాది ఆగస్టు 11న ఇంట్లో నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. అలీ కోసం అంతటా వెతికినా లాభం లేకుండా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కుటుంబసభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.